క్లుప్తంగా

అమ్మవారికి వెండి కిరీటం, ఖడ్గం బహూకరణ



వెండి కిరీటం, ఖడ్గాన్ని బహూకరిస్తున్న భాస్కరరావు దంపతులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారికి కొత్తూరు మండలం మెట్టూరు బీట్–1 గ్రామానికి చెందిన భాస్కరరావు, పద్మావతి దంపతులు వెండి కిరీటం, ఖడ్గంను బహూకరించారు. మంగళవారం అమ్మవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి కిరీటం, ఖడ్గంను అమ్మవారికి సమర్పించి.. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, అర్చకులు, ఆలయ సిబ్బందికి అందజేశారు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ఆలయ సిబ్బంది తెలిపారు. సుధాకరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర కేజీ వెండి పాదాల వితరణ



వెండి పాదాలు అమర్చుతున్న అర్చకులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరం పాదాలమ్మ తల్లి అమ్మవారికి వెండితో తయారు చేయించిన పాదాలను శ్రీకూర్మాం దేవస్థానం అర్చకులు దాస్‌బాబు దంపతులు వితరణ చేశారు. ఈ మేరకు అమ్మవారి ఆలయ అర్చకులు దమ్మల రామారావు మంగళవారం తెలిపారు. పాదాలను అమ్మవారికి అలంకరించామన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి మాట్లాడుతూ పాదాలమ్మ తల్లి అలంకరణకు వీలుగా భక్తులు ఆభరణాలు వితరణ చేయాలని కోరారు. దాస్‌బాబును అభినందించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: ప్రతి విద్యార్థి ఇంటర్‌మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల పేరు రాష్ట్ర వ్యాప్తంగా ఇనుమడింపజేయాలని ఇంటర్‌మీడియెట్ బోర్డు ఆర్‌ఐఓ సివ్వాల తవిటినాయుడు అన్నారు. మంగళవారం కళాశాల 69వ వార్షికోత్సవం, విద్యార్థుల వీడ్కోలు సభను ఎన్ఎస్ఎస్ పీఓ జె. రవిబాబు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు




వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ముఖ్యంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలు గడపగడపకూ చేరుతున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక 23వ వార్డు వెంకయ్యపేటలో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల వద్దకు వెళ్లగలిగే సమర్థవంతమైన పాలన సీఎం జగన్ అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ పాలన, నేటి సీఎం జగన్ పాలనను ప్రజలే బేరీజువేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ఇటువంటి నాయకుడు రాష్ట్రానికి అవసరమని, మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, ఏఈ బి.శృజన, టీపీఎస్ హెచ్.వి.సత్యనారాయణ, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు బి.ఏ కాశమ్మ, బి.అజంతాకుమారి, డి.చిరంజీవిరావు, పార్టీ ముఖ్య నాయకులు మామిడి శ్రీనివాసరావు, రమేష్, ప్రభాకరరావు, రాజు, ఎ.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేద్దాం



సీఎంను కలిసిన ధర్మాన కృష్ణదాస్, కృష్ణచైతన్య

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు సీఎం హామీ

పోలాకి/నరసన్నపేట: రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ఖరీఫ్‌లో పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చెప్పారు. తన కుమారుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్యతో కలిసి మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. జిల్లా రాజకీయాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లాలో ఇప్పటికే 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, మరో 1.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందని, వారికి నష్టం కలగకుండా చూడాలని సీఎం దృష్టికి తీసుకురాగానే, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. వంశధార నిర్వాసితులకు రూ.25కోట్లు నిధులు త్వరలోనే చెల్లించడంతో పాటు సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకానికి పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్ల నిధులను త్వరలోనే విడుదల చేసి మొదటిదశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ఈఏడాది చివర్లో నీటిని విడుదల చేస్తామని వివరించారు. పాతపట్నం నియోజకవర్గంలో 170 గ్రామాలకు సంబంధించి మంచినీటి వాటర్‌గ్రిడ్ పథకం పనులు సైతం వేగవంతం చేస్తామన్నారు. రూ.50 కోట్లతో నిర్మిస్తున్న పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ఇప్పటికే 70శాతం పూర్తయిందని, వచ్చే ఏడాదికి ఉద్దానం మంచినీటి పథకం అందుబాటులోకి తెచ్చేలా పనులు చేయిస్తున్నామని తెలిపారు.

జేఈఈలో మెరిసిన సిక్కోలు విద్యార్థులు




సంచాన అజయ్ కుమార్, కొత్తకోట జీవన్‌కుమార్

పాతపట్నం: జాతీయ స్థాయిలో మంగళవారం విడుదలైన జాయింట్ ఎంట్రాన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)–2023 (మెయిన్స్) ఫలితాల్లో పాతపట్నం విద్యార్థి సంచాన అజయ్‌కుమార్ సత్తాచాటాడు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో కలిపి 99.7 శాతం మార్కులతో ప్రతిభ కనబరిచాడు. తండ్రి సంచాన సంఘమేశు హిరమండలం మండలంలోని భగీరథపురంలో ఉపాధ్యాయుడిగా, తల్లి సంచాన ప్రమీల రాణి సారవకోట మండలం పెద్దలంబలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అజయ్‌కుమార్ పాతపట్నం సెయింటాన్స్ పాఠశాలలో ఐదో తరగతి వరకు, వెన్నెవలసలో నవోదయలో పదో తరగతి చదివాడు. విశాఖపట్నం నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు.

కంచిలి: మండల కేంద్రానికి చెందిన కొత్తకోట జీవన్ కుమార్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో కలిపి 98.86 శాతం మార్కులు సాధించాడు. జీవన్ తల్లిదండ్రులు నాగరాజు, వసంత సంతోషం వ్యక్తంచేశారు.

నివగాం వీఆర్ఓకు ఉద్యోగోన్నతి

కొత్తూరు: మండలంలోని నివగాం వీఆర్వోగా పనిచేస్తున్న వి.రవికుమార్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి వచ్చింది. మంగళవారం శ్రీకాకుళం జేసీ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌లో రవి కుమార్‌ను కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. పి.లక్ష్మణకుమార్ ఉద్యోగోన్నతిపై కొత్తూరు రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐగా నియమితులైనట్లు తహసీల్దార్ పి.బాల తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన నారాయణమూర్తి, వెంకట శ్రీనివాసరావు

బూర్జ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ మండలం గుత్తావల్లి నుంచి పాలకొండ వైపు ద్విచక్ర వాహనంపై బొడ్డేపల్లి నారాయణమూర్తి, గజ్జల వెంకట శ్రీనివాసరావు వెళ్తున్నారు. పార్వతీపురం నుంచి నరసన్నపేట వస్తున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొంది. స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది క్షతగాత్రులను శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బొడ్డేపల్లి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన



తప్పెటగుళ్ల ప్రదర్శనలో చిన్నారులు

మెళియాపుట్టి: ప్రాచీన కళలు అంతరించిపోకుండా కళాకారులు వాటిని కాపాడుకోవడానికి రకరకాల ప్రదర్శనలు ఇస్తూనే ఉన్నారు. అయితే చిన్నారులకు సైతం కళలను నేర్పుతూ జీవంపోస్తున్నారు. మండలంలోని మర్రిపాడు-సి గ్రామ పంచాయతీ పరిధిలోని జలకలింగపురంలో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో చిన్నారులు తప్పెటగుళ్ల ప్రదర్శనతో చూపరులను ఆకట్టుకున్నారు. తప్పెటగుళ్లు వాయిస్తూ..పాటలు పాడుతూ అలసిపోకుండా ఉత్సాహంతో ఉరకలేస్తుంటే.. ప్రజలు గంటల కొలది నిలబడి వీక్షించారు. ఇటువంటి కళలు అంతరించిపోకుండా రాబోయే కాలానికి జ్ఞాపకంగా.. తరతరాల్లో కళకు జీవంపోసేలా చిన్నారులకు సైతం నేర్పించామని పలువురు కళాకారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: మండలంలో మునగవలస పంచాయతీ సంతకొత్తవలసలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బూరవెల్లి అప్పలనాయుడు, బూరవెల్లి అసిరయ్యకు చెందిన రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించి రూ. 20 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆస్తి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సాయాన్ని అందజేస్తామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు దన్నాన సత్యనారాయణ, దన్నాన అజయ్‌కుమార్ ఉన్నారు.

61 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని వేర్వేరు చోట్ల 61 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధనం చేసుకున్నారు. పాతపట్నంలోని వేంకటేశ్వర ఆలయ సమీపంలో 41 ఒడిశా మద్యం బాటిళ్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కోటబోమ్మళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నడిచి వస్తుండగా. అనుమానంతో వారిని తనిఖీ చేశారు. వారివద్ద మద్యం పట్టుబడటంతో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.

బూరగాం వద్ద..

పాతపట్నం మండలంలోని బూరగాం గ్రామం వద్ద పోలీసుల తనిఖీల్లో 20 ఒడిశా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బూరగాం గ్రామానికి చెందిన దంబూరు ఆప్తో వద్ద 20 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

91 కొత్త కేసుల నమోదు

జలుమూరు: గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఎల్సీడీసీ సర్వేలో జిల్లా వ్యాప్తంగా కొత్తగా 91 కొత్త కేసులు నమోదయ్యాయని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వి.సురేష్ అన్నారు. మంగళవారం జలుమూరు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో మా ట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణతోపాటు జాతీయ కార్యక్రమాల అమలులో ఆశ కార్యకర్తలది కీలకపాత్ర అన్నారు. జనవరి నెల 30 నుంచి ఈ నెల 13 వరకు జరగనున్న స్పర్శ (లెప్రసీ) అవగాహన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు.

గృహసారథులే విజయ సారథులు



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- ప్రభుత్వం చేసే అభివృద్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లపైన ఉందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలో కామేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం మున్సిపాలిటీకి సంబంధించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలని, ఇది చారిత్రక అవసరమని స్పీకర్ గుర్తుచేశారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సచివాలయాల కో ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రవికుమార్, మెట్ట జోగారావు, ఎస్.రామారావు, కె.రామకృష్ణ, పొన్నాడ చిన్నారావు, మామిడి ప్రభాకరరావు, సాధు చిరంజీవిరావు, పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ పగడాలమ్మ



పాతపట్నం: విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న డీఈఓ పగడాలమ్మ

పాతపట్నం/సారవకోట: ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. పాతపట్నం మండలంలోని ప్రహరాజపాలెంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, సారవకోట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు అకడమిక్ విషయాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పాతపట్నం, సారవకోట ఎంఈఓలు సి.హెచ్.మణికుమార్, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర భూ రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దకోట, మోదుగువలస, జంగాలవలస తదితర రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర భూ రీసర్వేను మంగళవారం పరిశీలించారు. రైతులతో పొలం వద్దకు వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. సర్వే అనంతరం రికార్డుల్లో తప్పుడు వివరాలు ఉండకూడదన్నారు. గ్రామాలకు సర్వే చేసేందుకు వచ్చిన సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

నరసన్నపేట: దేశ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడాలని, ఈ మేరకు గ్రామాల్లో ప్రచారం చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహ సంఘటన కార్యదర్శి శివ అన్నారు. స్థానిక వేంకటేశ్వరాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ వ్యవస్థాపన, దాని ప్రాముఖ్యతను వివరించారు. వివిధ దేశాల్లో హిందూత్వానికి ప్రాధాన్యత పెరుగుతుందని, దేవాలయాలు వివిధ దేశాల్లో నిర్మించి పూజలు చేస్తున్నారని, ఇతర దేశాల పౌరులు కూడా హిందూ దేవుళ్లపై ఆకర్షితులవుతున్నారన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సాయిరాం, స్థానిక ప్రతినిధి సూరప్పడు, జిల్లా కళింగ కోమట్ల సంఘం అధ్యక్షుడు తంగుడు జోగారావు, కళింగ కోమట్ల సంఘం నరసన్నపేట ప్రతినిధులు బొయిన బాలకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల గుంపును తరలించాలి

కొత్తూరు: ఒడిశా అడవుల నుంచి 15 ఏళ్ల క్రితం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట రిజర్వ్ ఫారెస్ట్‌కు వచ్చిన ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఏనుగులు ఇంతవరకు 14 మందిని పొట్టనపెట్టుకున్నాయన్నారు. ఈ నెల 5 తేదీ రాత్రి భామిని మండలం పసుకిడి వద్ద ఏనుగుల గుంపు ట్రాక్టర్‌పై దాడి చేసి చంపడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలు చెల్లించాలన్నారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలు, మోటార్లు, ఇళ్లతోపాటు పలు రకాల నష్టాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

నరసన్నపేట: మండలంలో రబీ సాగులో ఉన్న పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కె.సునీత రైతులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలు రైతులకు అందనున్నాయన్నారు. బొరిగివలస, నరసన్నపేట-4 సచివాలయాల్లో ఈ-క్రాప్ నమోదును మంగళవారం పరిశీలించారు.

మండలంలో 90 శాతం మంది రైతులు ఈ కేవైసీ చేయించుకున్నారని, నూరు శాతం కావాలన్నారు. రైతులు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు తీసుకువెళ్లి ఈ- క్రాప్ చేయించుకోవాలన్నారు. నువ్వు పంటను ప్రస్తుతం రైతులు వేస్తున్నారని, ఈ పంటను కూడా నమోదు చేసుకోవాలన్నారు.

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215





విధుల్లో చేరిన కొత్తూరు తహసీల్దార్

కొత్తూరు: స్థానిక తహసీల్దార్‌గా పి.బాల మంగళవారం విధుల్లో చేరారు. తహసీల్దార్ బాలను ఈ ఏడాది జనవరి 24న జిల్లా కలెక్టర్ కలక్టరేట్‌కు సరెండర్ చేశారు. అయితే పరిపాలన సౌలభ్యం కోసం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న కె.బాలకృష్ణను టెక్కలి సబ్ కలెక్టర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఈ నెల 4వ తేదీన నియమించారు. అయితే టెక్కలి సబ్ కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను కలెక్టర్ అబియన్స్‌లో పెట్టి.. సరెండర్‌లో ఉన్న తహసీల్దార్ పి.బాలను తిరిగి కొత్తూరులోనే తహసీల్దార్‌గా నియమిస్తూ ఈ నెల 6 తేదీన ఉత్తర్వులు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి 15 రోజుల తరువాత తహసీల్దార్ విధుల్లో చేరారు.

సాగునీటి పొదుపుపై అవగాహన

సరుబుజ్జిలి: సాగులో నీటిని తక్కువగా వినియోగించి పంటలు పండించే విధానం గురించి ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని ప్రత్యామ్నాయ తడి, పొడి పద్ధతి ప్రాజెక్ట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీలత తెలిపారు. మంగళవారం సింధువాడ, వీరమల్లిపేట రైతులతో క్షేత్రస్థాయిలో పర్యటించి పైపులు వినియోగించే విధానం గురించి అవగాహన కల్పించారు. నీరు వృథా కాకుండా ఉండేందుకు అవసరమైన పైపులు ఏర్పాటు చేస్తామన్నారు.

రైతులంతా గ్రూపుగా ఏర్పడితే రైతులకు కావాల్సిన స్ప్రింక్లర్లు, ఇతర పరికరాలు అందిస్తామన్నారు. నెదర్లాండ్, జర్మనీ శాస్త్రవేత్తలు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, సింధువాడ సర్పంచ్ గోవిందు కామేశ్వరి, రీజనల్ డైరెక్టర్ సి.హెచ్.కృష్ణ, పీఐపీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.





























మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పోలాకి

రేఖా సంఖ్య. 04/2023/ఎ, తే. 07/02/2023 ది.

వేలం ప్రకటన

పోలాకి మండల ప్రజా పరిషత్ ఆధీనములో గల కోడూరు జీడి మామిడి తోట 2022–23 ఆర్థిక సంవత్సరమునకు ఫలసాయం హక్కు పొందుటకు తే.09.02.2023ది మధ్యాహ్నం గం. 2.00 లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందే వారిచే గాని బహిరంగవేలం వేయబడును. సదరు వేలంపాట పాడదలచినవారు ఒక లక్ష రూపాయలకు సాల్వేన్సు సర్టిఫికేట్ పొంది, ప్రథమ దరావత్తుగా రూ. 30,000/- లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రజా పరిషత్, పోలాకి వారి పేరున చెల్లుబాటు అయ్యే విధముగా భారతీయ స్టేట్ బ్యాంకు వారిచే జారీ కాబడిన డిమాండ్ డ్రాఫ్టు పొంది, సదరు డిమాండ్ డ్రాఫ్టు వేలంపాట సమయములో నమోదు చేసిన పిదప వేలంపాటలో పాల్గొనవలెను. పాట నిఖరము కాబడిన తదుపరి వేలంపాట మొత్తం సొమ్మును తక్షణమే చెల్లించవలెను. అటుల చెల్లించనిచో అప్పటికి సమర్పించిన డిమాండ్ డ్రాఫ్ట్ మొత్తము అనగా దరావత్తు సొమ్ము మండల పరిషత్ సాధరాణ నిధులకు సర్దుబాటు చేసి ఖరారు చేసిన పాట రద్దు పరచబడును. మరియు పాట మొత్తము సంతృప్తికరముగా లేనిచో వేలంపాట వాయిదా వేయుట లేక రద్దు పరచుటకు సర్వ హక్కులు పోలాకి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారికి గలవు.

సం/- మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, పోలాకి.

